12న వీర్ హనుమాన్ విజయ్ యాత్ర



కాచిగూడలో ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్ సేన నేతలు

కాచిగూడ: హనుమాన్ జన్మోత్సవ్‌ను పురస్కరించుకొని బజరంగ్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన హనుమాన్ వ్యాయామశాల నుంచి తాడ్‌బన్ హనుమాన్ మందిర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు తెలిపారు. బుధవారం కాచిగూడలోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో శ్రీ వీర్ హనుమాన్ విజయ్ యాత్ర బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 12న ఉదయం 10గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన నగర అధ్యక్షుడు మనోజ్ మొగల్గిద్ది, నగర మహిళా అధ్యక్షురాలు దుర్గాశర్మ, రాఘవ, నరేష్, అశ్విన్, రామేశ్వర్ మిశ్రా, ప్రవీణ్ యాదవ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు చేయూత



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

అంబర్‌పేట: పేద బ్రాహ్మణులను అన్ని విధాల అదుకునేందుకు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో పలువురు పండితులకు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా నగదును అందించి వారికి చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఆయా ఆలయాల్లో పూజలు చేస్తున్న పేద బ్రాహ్మణులకు కొంత నగదును అందించి ఆర్థికంగా అండగా ఉంటున్నానని అన్నారు.

12, 13న బీపీటీఎంఎం జాతీయ మహాసభలు

చిక్కడపల్లి: భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్(బీపీటీఎంఎం) 7వ త్రైవార్షిక జాతీయ మహాసభలు 12, 13వ తేదీలలో నగరంలోని అన్నోజిగూడలో నిర్వహిస్తున్నట్లు బీపీటీఎంఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలలో ముఖ్యఅతిథులుగా కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు హిర్మయి పాండ్యా, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటల రాజేందర్, ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జి శ్రీవాత్సని పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లు కార్మికులు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ధరల పెరుగుదలతో సామాన్యులపై తీవ్ర భారం

ముషీరాబాద్: గ్యాస్ ధరలు పెంచి కేంద్రం ప్రభుత్వం ప్రజలను లూటీ చేస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యులపై తీవ్ర భారం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో అసంఘటిత రంగం, మధ్య తరగతి, రైతాంగం బతుకు భారమవుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్ ధర తగ్గుతుంటే మన దేశంలో పెంచడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.

విమర్శలు ఆపి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

కవాడిగూడ: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మన్నే దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇందిరాపార్కు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ... నామినేటెడ్, మంత్రి పదవులు రెడ్డి సామాజికవర్గానికి కట్టబెడుతూ బీసీలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిచేయి చూపెడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం ఆపి ఎమ్మెల్సీ కవిత అన్నట్లు అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్



భరత్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సదానంద్ ముదిరాజ్, పూసరాజు, కార్యకర్తలు

ముషీరాబాద్: దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారని.. అందుకే దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్ అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన జమాల్‌పురి నందు బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌నగర్, శివాలయం చౌరస్తా ప్రాంతాలలో పార్టీ జెండాలను ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజుతో కలసి సదానంద్ ముదిరాజ్ ఆవిష్కరించారు. అనంతరం సదానంద్ మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ బలమైన శక్తిగా మారిందన్నారు. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలు కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు బద్రినారాయణ, అనిల్‌కుమార్, అజయ్‌గుప్తా, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కేంద్రం ధ్యేయం: కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. గాంధీనగర్‌లోని జవహర్‌నగర్, ఎల్‌ఐసీ బ్రిడ్జి వద్ద బుధవారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. బూత్ అధ్యక్షులు శివ, డి.కుమార్, కోఆర్డినేటర్లు శైలేష్, రాహమత్ అలీల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసీ బ్రిడ్జి వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పావని, నేతలు



న్యూ అంబేద్కర్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

ప్రజాపాలన కాదు కన్ఫ్యూజన్ పాలన: కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని అది కన్ఫ్యూజన్ పాలనని కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ విమర్శించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎన్. చారి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని న్యూ అంబేద్కర్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనతో తెలంగాణ ప్రజలు అయోమయంలో పడ్డారని విమర్శించారు. బీజేపీతోనే తెలంగాణలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రమేష్ రామ్, నాయకులు జి.వెంకటేష్, పరిమల్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు దిలీప్ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేతల మధ్య ఫ్లెక్సీ వార్!



వివాదానికి దారి తీసిన ఫ్లెక్సీ

ముషీరాబాద్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ ఆధ్వర్యంలో శివాలయం చౌరస్తా వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అక్కడే జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉండటంతో నాయకులంతా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఫ్లెక్సీలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఫొటో లేకపోవడంతో స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఆమె భర్త నియోజకవర్గ పార్టీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లెక్సీ ఏర్పాటులో ప్రోటోకాల్ పాటించరా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్టీ నేతల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇది గమనించిన ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు శివాలయం చౌరస్తా నుంచి బద్రినారాయణను తీసుకెళ్లడంతో గొడవ సద్దుమనిగింది. ఇదిలా ఉంటే ఇరువురి నేతల మధ్య కొంత కాలంగా సఖ్యత లేదని స్థానిక నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. దాని వల్లే వాగ్వాదం చోటు చేసుకుని ఉండొచ్చని చెబుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో హనుమాన్ విజయయాత్ర

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో శోభాయాత్ర సాగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ ఆనంద్ తదితరులు

చిక్కడపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే 'వీర హనుమాన్ విజయ యాత్ర'ఏర్పాట్లపై బుధవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో యాత్ర నిర్వాహకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో విజయయాత్ర నిర్వహించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశం అనంతరం కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర శాఖల అధికారులు, నిర్వాహకులతో కలసి ఊరేగింపు సాగే మార్గాన్ని పరిశీలించారు. గౌలిగూడ రామ మందిరం నుంచి నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు చౌరస్తా, అశోక్‌నగర్, కవాడిగూడ, బైబిల్ హౌస్, తాడ్ బండ్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్లు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.నర్సింహమూర్తి, భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



సువర్ణభారతి గోశాలలో మహేష్ అగర్వాల్

కాచిగూడ: తెలంగాణలో పశు సంరక్షణకు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. వేసవిలో ఎండవేడిమికి నీరు, పశుదాణా సరిగా అందక పశువులు మరణిస్తున్నాయని వాటిని కాపాడే విధంగా ప్రభుత్వం గోశాలలకు నీటి వసతితో పాటు, పశుదాణాను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహావీర్ జయంతిని పురస్కరించుకుని జైన్ సేవా సంఘ్, సహయోగ్ ఆధ్వర్యంలో సీనియర్ అడ్వకేట్ సీపీ సారథి జ్ఞాపకార్థం బుధవారం సువర్ణభారతి గోశాలను ఆయన సందర్శించి పశువులకు పశుగ్రాసం పంపిణీ చేశారు. గో సంరక్షణకు ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిట్టల గోపాలకృష్ణ, ప్రేమ్‌చంద్ మునోత్, భక్తరామ్, నరహరి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి



ధర్నాచౌక్‌లో దాసురామ్‌నాయక్, లక్ష్మణ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

కవాడిగూడ: దేశ వ్యాప్తంగా చేపట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని బుధవారం ఇందిరా పార్కు వద్ద బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసు రామ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నిర్వహించారు. ధర్నాకు వారికి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అరెస్టు చేసి చిక్కడపల్లి పీఎస్‌కు తరలించారు. పోలీసుల తీరును నిరసిస్తూ వారు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలన్నారు. బహుజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ నాయకులు పాండు నాయక్, శంకర్ నాయక్, శ్రీకాంత్ నాయక్ , శివనాయక్ ఎం.డీ పరీద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: అనారోగ్యంతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... వారసిగూడ ప్రాంతానికి చెందిన బాబురావు గౌడ్ (64) ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబురావు గౌడ్ కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అందుకే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హమ్మయ్య.. రోడ్డును చదును చేశారు'



సాగర్‌లాల్ ఆస్పత్రి రోడ్డు చదును చేస్తున్న జలమండలి సిబ్బంది

ముషీరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి దాయార మార్కెట్ నుంచి సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తడంతో స్థానికులు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులు మట్టితో రోడ్డును చదును చేశారు. ఇటీవల 1000 ఎంఎం డయా మంచినీటి పైపులైన్ పనులు పూర్తికావడంతో ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. కనీసం ప్యాచ్‌వర్క్ పనులు కూడా చేపట్టకపోవడంతో పైపులైన్ వేసిన చోట రోడ్డు కుంగిపోయి ప్రమాదంగా మారింది. ప్రజల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి బుధవారం పనులు ప్రారంభించారు.

బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వినతి

ముషీరాబాద్: బాపూజీనగర్‌లో బస్తీ దవాఖానాను త్వరలో ఏర్పాటు చేస్తామని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు. ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్ బుధవారం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కోరారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి బస్తీలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల శ్రీకాంత్‌గౌడ్, రమేష్‌గౌడ్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని బహుజన్ ముక్తి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కు వద్ద జైల్ భరో కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులను అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా నిరసన తెలుపుతున్న నాయకుల పట్ల నిర్బంధాన్ని విధించడం సరికాదన్నారు. తమ హక్కుల కోసం ఆందోళన చేసే స్వేచ్ఛ కూడా తమకు లేదా అని ప్రశ్నించారు. నిర్బంధించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవన్నారు. త్వరలో ప్రజలే వారికి గుణపాఠం చెబుతారని అన్నారు.

ఏప్రిల్ నెలంతా ఉచితంగా ఆటిజం స్క్రీనింగ్ టెస్టులు

పంజగుట్ట: ఆటిజం వ్యాధిపట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని అనన్య చైల్డ్ డవలప్‌మెంట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ క్లినిక్ నిర్వాహకురాలు మాధవి ఆదిమూలం తెలిపారు. ఏప్రిల్ ప్రపంచ ఆటిజం అవగాహన నెల అయిన ఏప్రిల్‌లో ఉచిత స్క్రీనింగ్, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ చిన్నపిల్లల సైకియాట్రిక్ వైద్యులు శివ అనూప్ ఎల్లాతో కలిసి మాట్లాడారు. ఈ వ్యాధిని చిన్నారుల్లో రెండేళ్లలోపు గుర్తిస్తే నయం చెయొచ్చని తెలిపారు.

ట్యాంక్‌బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: మహిళలకు సమానత్వం కోసం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం కాచిగూడలో బీసీ సంఘాల ప్రతినిధుల కోర్ కమిటీ సమావేశం గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ మహనీయుల చరిత్ర భావితరాలకు తెలియాలంటే 150 అడుగుల పూలే దంపతుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ గురువుగా భావించే పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని ప్రశ్నించారు. ఏప్రిల్ 11న పూలే జయంతి వేడుకల్లో పూలే దంపతుల విగ్రహ ఏర్పాటుపై సీఎం ప్రకటన చేయాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలందరూ సంఘటితంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, జిల్లాపెల్లి అంజి, జెల్ల నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆలె నరేంద్ర పాత్ర కీలకం



గాంధీనగర్ డివిజన్‌లో ఆలె నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని, బీజేపీ నేతలు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో మాజీ కేంద్రమంత్రి టైగర్ ఆలె నరేంద్రది కీలక పాత్ర అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం మాజీ కేంద్రమంత్రి ఆలె నరేంద్ర వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ఆలె నరేంద్ర ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ముదిరాజ్, నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో చైత్రచంద్రిక శీర్షికతో అభినయంపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో బుధవారం శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 18 నుంచి 20 వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో తరగతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ ఇందిర, హేమ, మధుమతి, సంజయ్ కుమార్ జోషి, మాధవీమాల పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి





నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: బీఆర్‌ఎస్ రజతోత్సవంలో భాగంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం నల్లకుంట శివం రోడ్డులో నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో జరిగిన ఘటనతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టడానికి ఈ సమావేశం వేదిక అవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైన పార్టీ జెండా దిమ్మెలు శిథిలమైతే సభకు వారం రోజుల ముందే వాటి స్థానంలో కొత్తవి నిర్మించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. నల్లకుంట డివిజన్ నుంచి సభకు వచ్చే వారి కోసం 5 బస్సులు, 30 కార్లు, అలాగే భోజనాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బస్సులు ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని అందుకు కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.భూపతినాథ్, కిషన్‌రావు, భాస్కర్‌గౌడ్, కూర నరేందర్, రమణా నాయుడు, పులిజాల గెల్వయ్య, ఎర్రబోలు నర్సింహారెడ్డి, సాయిని మూర్తి, బి. రఘురాంరెడ్డి, శోభ, క్రిసోలైట్, ఇర్ఫానా, సుల్తానా, లావణ్య, వన్నడి రమ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.